www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231



తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :16 | 25-01-2021 | పుటలు : 4




జనవరి 26

గణతంత్ర దినోత్సవ

శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

## నన్నయ ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ఆచార్య టి.అశోక్






**23.01.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్చార్జ్ రిజిస్ట్రార్‌గా ఆచార్య తుపాకుల అశోక్‌ను నియమిస్తూ ఉపకుల పతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం విశ్వవిద్యా లయంలో నూతన ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ఆచార్య టి.అశోక్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ఇన్‌ఛార్జ్ స్పెషల్ ఆఫీసర్‌గా డా.ఎం.కమలకుమారి, యూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఇన్‌ఛార్జ్ అసోసియేట్ డీన్‌గా డా.పి.వెంక టేశ్వరరావును నియమిస్తూ వీసీ ఉత్తర్వులను అందిం చారు. ఈ సందర్భంగా ఈసీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా విశేష సేవలందించి పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న ఆచార్య బట్టు గంగారావును అభినందించారు. నూతన ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా ఆచార్య టి.అశోక్‌ను నియమించామన్నారు. పులివెందలలోని వై.ఎస్.ఆర్.ఆర్ లయోలా డిగ్రీ కాలేజ్‌లో అధ్యాపక వృత్తిని ప్రారంభించిన అశోక్ 14 సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో విధులు నిర్వహించి ఆచార్యులుగా ఎదిగారని తెలిపారు. గతంలో ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారిగా, కాకినాడ క్యాంపస్ ప్రత్యేకాధికారిగా పని చేయడంతో పాటు నన్నయ విశ్వ విద్యాలయానికి రిజిస్ట్రార్‌గా సేవలందించారని చెప్పారు. మరోసారి రిజిస్ట్రార్ బాధ్యతలు స్వీకరించిన ఆచార్య టి.అశోక్‌కు వీసీ శుభాకాంక్షలను తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తనకు అందించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి విశ్వవిద్యాలయాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానన్నారు. రెండోసారి విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా పనిచేయ డం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. వీసీ మార్గదర్శకంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అందరి సహకారంతో విశ్వవిద్యాల యాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని తెలియజేశారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్స్, ఆయా విభాగాల సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అశోక్‌నకు శుభాకాంక్షలను తెలియజేశారు. అలాగే కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న డా.ఎం.కమలకుమారికి, యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ అసోసియేట్ డీన్‌గా అదనపు బాధ్యతలు స్వీకరిస్తున్న డా.పి.వెంకటేశ్వరరావుకు శు భాకాంక్షలను తెలియజేశారు.







చెక్కనిదే శిల కడుపున
శిల్పమెలా పుడుతుంది ?!

నలగనిదే అడుగు నటన
ఎలా రక్తి కడుతుంది ?!

ఫలితం అందేది
తీవ్ర పరిణామంలోనే సుమా!!

- ఆచార్య సి.నారాయణరెడ్డి.



### కృతజ్ఞత

*విశ్వవిద్యాలయానికి ఏడాదిపాటు కులసచివులుగా (రిజిస్ట్రార్) విశేషమైన సేవలందించిన ఆత్మీయ హృదయులు, నిరాడంబరులు ఆచార్య బట్టు గంగారావు గారికి మనఃపూర్వక కృతజ్ఞతాంజలి!!*

*ఆ బాధ్యతల్ని అందిపుచ్చుకుని సేవా సంసక్తులైన దక్షులు ఆచార్య తుపాకుల అశోక్ గారికి శుభాకాంక్షలు!!*

- నన్నయవాణి

## గోదావరి కల్చరల్ మ్యూజియం ఏర్పాటు చేద్దాం

### తెలుగు భాష సంస్కృతి అభివృద్ధి మండలి చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్




**20.01.21 ((మీడియాసెల్)** ఉభయ గోదావరి జిల్లాలకు విద్యాకేంద్రంగా ఉన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గోదావరి కల్చరల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేద్దామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తెలుగు భాష సాంస్కృతిక అభివృద్ధి మండలి చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్ అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం తెలుగుభాష సాంస్కృతిక అభివృద్ధి మండలి కమిటీ బృందం పర్యటించింది. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్, ఎమ్మెల్సీలు, కమిటీ సభ్యులు కత్తి నరసింహారెడ్డి, పి.వి.ఎన్.మాధవ్, వి.బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రగతి నివేదికను, కోవిడ్ కాలంలో నిర్వహించిన వెబినార్ల విజ్ఞానాన్ని, పరీక్షల నిర్వహణను, ఐఎస్ఓ సాధనను గురించి వీసీ వివరిం చారు. తెలుగుభాష అభివృద్ధికి సంబంధించిన విశ్వవిద్యాలయం ప్రత్యేక దృష్టిని సారించిందని అన్నారు. సంస్కృతి సంప్రదాయాలకు కేంద్రమైన రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గోదావరి కల్చరల్ మ్యూజియం, రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు సహకరించాలని కమిటీని వీసీ కోరారు. దీనిపై చైర్మన్ మహ్మద్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఏడాది కాలంలో ఎంతో అభివృద్ధిలోకి తీసుకొచ్చారని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును ప్రసంసించారు. వీసీ విజన్ ద్వారా విశ్వవిద్యాలయం నాక్ గుర్తింపును సాధించి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గోదావరి కల్చరల్ మ్యూజియం అండ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు కమిటీ పూర్తి మద్దతును తెలియజేస్తుందని చెప్పారు. తెలుగు భాష, సంస్కృతిని కాపాడేందుకు సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. విశ్వవిద్యాలయం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉద్యోగ భద్రతపై తమవంతు ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. విశ్వవిద్యాలయ తెలుగుశాఖ నిర్వహించిన భాష సాహిత్య అభివృద్ధి అంశాలను కోర్సు కోఆర్డినేటర్ డా.టి.సత్యనారాయణ వివరించారు. అనంతరం తెలుగుభాష సాంస్కృతిక అభివృద్ధి మండలి చైర్మన్, సభ్యులను వీసీ సన్మానించి జ్ఞాపికను, నన్నయవాణి పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.టేకి, తెలుగుశాఖ అధ్యాపకులు డా. తలారివాసు, డా.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.





# సంపాదకీయం

## గణతంత్రం



కొన్ని క్షణాలు మానవ చరిత్రను మార్చగల మహత్తును కలిగివుంటాయి. అటువంటిదే జనవరి 26. సర్వసత్తాక ప్రజాస్వామిక గణతంత్ర దినోత్సవం. భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చిన రోజు. భారత ప్రభుత్వ చట్టానికి బదులుగా భారత రాజ్యాంగం దేశ పరిపాలనకు అనుకూలంగా ఏర్పడిన రోజు. 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందితే, భారతదేశం స్వతంత్ర గణతంత్రంగా ఆవిర్భవించేందుకు 1950 జనవరి 26 ప్రజాతంత్ర పరిపాలన అమలులోనికి వచ్చిన సుదినం.

జనవరి 26 భారతదేశానికి చారిత్రాత్మకమైనది. 1930 జనవరి 26న భారత జాతీయ కాంగ్రెస్ పూర్ణ స్వరాజ్ ను ప్రకటించింది.నాటికి మన పతాకాన్ని మనం ఎగురవేశాం. స్వాతంత్ర దినోత్సవంగా అభివర్ణించుకున్నాం. కానీ తెల్లదొరలు రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ మీద గెలుపు తమ సంపూర్ణ విజయంగా భావించి దానికి గుర్తుగా ఆగస్టు 15న మనకు స్వాతంత్ర్యం ప్రకటించారు. కానీ జనవరి 26 మనకు ప్రత్యేకమైన రోజు. అందుకని ఆ రోజు చరిత్రలో శాశ్వతంగా మిగలటం కోసం రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకొచ్చాం. 1946 నుంచి 1949 వరకు నాలుగేళ్ళ కృషి మన రాజ్యాంగం. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి గెలుపొందిన రాజకీయనేతలు, వివిధ రంగాల నుండి నామినేట్ చేసిన నిపుణులు కలసి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి ప్రధానమైన కృషి , నేతృత్వంలో భారత రాజ్యాంగ నిర్మాణం జరిగింది.

భారత పౌరులమైన మేము... అనే మాటతో మన రాజ్యాంగం ఆరంభమవుతుంది. ఇది ప్రజల కోసం, ప్రజలు రాసుకుని, ప్రజలే అందించిన రాజ్యాంగమని అర్థం. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం రాజ్యాంగానికి ఆత్మ వంటివి.కాలానికి ఆధునికతను అద్దినది ప్రజాస్వామ్యమే. ఆ భావన ఒక ఆదర్శం స్థాయిలోనే మిగిలిపోకుండా ఆకృతి దాల్చటానికి ఉపకరించేది రాజ్యాంగం." రాజ్యాంగం మార్గదర్శి.నేను ఏనాడు దానిని విస్మరించను" అన్నారు జార్జి వాషింగ్టన్. భారతదేశమనే పురాతన భూమిని ఆధునిక రాజకీయ,ఆర్థిక, సామాజిక, తాత్వికతలతో చెలిమి కట్టించటంలో మన రాజ్యాంగం నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకమైంది.ఏడు దశాబ్దాల ఆధునిక భారత ప్రస్థానానికి రాజ్యాంగమే మార్గదర్శిగా నిలిచింది. రాజ్యాంగం అంటే ఒక సమున్నతమైన చట్టం.అది అమలులోనికి వచ్చినది 1950 జనవరి 26. డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కె.ఎం.మున్షీ, భోగరాజు పట్టాభి సీతారామయ్య, జే.బీ. కృపలానీ,అల్లాడి కృష్ణస్వామి... వంటి వారెందరో రాజ్యాంగ నిపుణులు, స్వాతంత్ర పోరాటయోధులు సభ్యులుగా రాజ్యాంగ పరిషత్ కృషిచేసి భారత్ ను ఒకే దేశంగా కొనసాగటానికి అవరోధాలు లేకుండా చేస్తున్న మహోన్నత శక్తిగా రాజ్యాంగాన్ని మనకు అందించింది.

శ్రీశ్రీ అన్నట్లు....
" ఈ రాజ్యం మీదేనండి! మీ రాజ్యం మీరేలండి!!"

# విద్యా, పరిశోధనలపై ప్రణాళికలు సిద్ధం చేయండి

## రివ్యూ మీటింగ్‌లో వీసీ జగన్నాథరావు



రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**19.01.21 (మీడియాసెల్)** నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కోవిడ్ నిబంధనలు పాటిస్తూ తరగతుల నిర్వహణ, హాస్టల్ వసతులు వంటి అంశాలపై పక్కా ప్రణాళికను రూపొందించాలని విశ్వవిద్యాలయ అధికారులకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచించారు. యూనివర్సిటీ ప్రిన్సిపాల్స్, డీన్స్, హాస్టల్ వార్డెన్స్, స్పెషల్ ఆఫీసర్స్‌తో వీసీ రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలోని నూతన ప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు తరగతుల నిర్వహణ, హాస్టల్ వసతులు తదితర అంశాలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో చర్చించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పక్కా ప్రణాళికను రూపొందించి విద్యా సంవత్సరాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. తరగతుల నిర్వహణపై వారాంతంలో నివేదికను సమర్పించాలన్నారు. ముఖ్యంగా పిహెచ్‌డి అడ్మిషన్లు, పరిశోధన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. పరిశోధనపరమైన అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తామని, మంచి వాతావరణంలో పరిశోధనలు చేసుకొనేందుకు స్కాలర్‌లకు మార్గనిర్దేశం చేయాలని అన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ఆధారంగా యూజీసీ కోర్సుల తరగతులు రూపొందించాలని చెప్పారు. లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఈ-కంటెంట్ పాఠ్యాంశాలను అందిస్తున్నామని విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, క్యాంపస్ ప్రత్యేకాధికారులు, ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

### మంచి మాట



ఎప్పుడూ అహంకారమే గాయపడుతుంది. వినయంగా ఉన్న వ్యక్తిని ఎవరూ గాయపరచలేరు. అహంభావం అనే విషాన్ని తొలగించి మనస్సును నిర్మలం చేసుకోండి.

# నన్నయ ప్రవేశాలకు విశేష స్పందన

## కౌన్సిలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వీసీ

**18.01.21 ((మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని పీజీ ప్రవేశం కొరకు నన్నయ సెట్ 2020-21 లో అర్హత సాధించిన విద్యార్థులకు రెండవ దశ ఫిజికల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను నిర్వహిస్తున్నామని విద్యార్థుల నుండి విశేష స్పందన వస్తుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో నిర్వహిస్తున్న కౌన్సిలింగ్ కేంద్రాన్ని వీసీ పరిశీలించారు. కోవిడ్ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేస్తూ విద్యార్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్‌ను జరపాలని నిర్వాహకులకు సూచించారు. సోమవారం ఉదయం లైఫ్ సైన్సెస్(101), మేథమెటికల్ సైన్సెస్(103), కంప్యూటర్ సైన్సెస్(106), మధ్యాహ్నం ఫిజికల్ సైన్సెస్(102), తెలుగు(203), ఇంగ్లీషు(202), జియాలజీ(105) విద్యార్థులకు కౌన్సిలింగ్ జరిగిందన్నారు. 19వ తేదీ ఉదయం కెమికల్ సైన్సెస్(104), హింది(204), మధ్యాహ్నం కెమికల్ సైన్సెస్(104), హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్(201) జరుగుతాయన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు తమకు సమీపంలో ఉన్న కేంద్రానికి హాజరు కావచ్చునని అన్నారు. సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసిన అనంతరం రిజిస్టేషన్ ఫామ్‌లను విద్యార్థులకు అందజేశారు. 20వ తేదీ నుండి 22వ తేదీలలో వెబ్ ఆప్షన్లను పెట్టుకోవచ్చునని 25వ తేదీన సీటు కేటాయించడం జరుగుతుందన్నారు. 26 నుండి 28 లోపు ఆయా కోర్సులకు సంబంధించిన ఫీజులను చెల్లించి 29వ తేదీన కళాశాలకు హాజరు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా.డి.జ్యోతిర్మయి, అసోసియేట్ డైరెక్టర్ డా.కె.దీప్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫామ్ అందిస్తున్న వీసీ జగన్నాథరావు




## ప్రతిభా వాణి

### న్యాపతి సుబ్బారావు

**(1857 - 1941)**



తనచుట్టూ ఉన్న సమాజానికి మేలు చేయాలనే కోరిక ఏ కొద్దిమంది సత్పురుషులకో మాత్రమే కలుగుతుంది. తెలుగునాట ప్రజాసేవ పరాయణతను వ్యవస్థీకృతంగా ప్రారంభించిన తొలి తరంలో న్యాపతి సుబ్బారావు పంతులు గారు ప్రముఖులు. రాజమహేంద్రవరంలో ప్రముఖ న్యాయవాదిగా ఉంటూనే తెలుగుదేశపు సామాజిక జీవనంలో వికాస కృషికి సంస్థలు నిర్మించారు.

మద్రాసులో లా కళాశాలలో చదువుకుంటున్న రోజుల్లోనే ఇతర మిత్రులతో కలసి హిందూ పత్రిక స్థాపకులలో ఒకరయ్యారు. భారత జాతీయోద్యమంలో హిందూ పత్రిక విశేషమైన పాత్రను నిర్వహించింది. అఖిలభారత దేశీయ మహాసభకు తెలుగు ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించిన తొలితరం వారిలో అగ్రగణ్యులు. అఖిల భారత జాతీయ కాంగ్రెస్‌కు నాలుగేళ్ల కార్యదర్శిగా పనిచేసి దేశమంతా పర్యటించి స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని కలిగించారు. తెలుగు భాషకు వారు నడిపిన 'చింతామణి' పత్రిక విశేషమైన సేవలు అందించింది. ఇటువంటి మహనీయుల కృషి ఫలితమే నేటి మన స్వతంత్ర భారతం. వారికిదే నన్నయవాణి అక్షర నీరాజనం!!

## గ్రంథాలు, బీరువాలు బహూకరణ




సాహిత్యవేత్త కె.ఫణి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి గారు విశ్వవిద్యాలయానికి విలువైన గ్రంథాలను, బీరువాలను బహూకరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య జగన్నాథరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలను సమీకరించిన తెలుగు అధ్యాపకులు డా.తలారి వాసును అభినందించారు.

## జనవరి 23

## పరాక్రమ దినోత్సవం



## నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి



బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్‌లో చర్చిస్తున్న సభ్యులు

## నన్నయలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం

**21.01.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం బోర్డ్ ఆఫ్ స్టడీస్ మీటింగ్ నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సూచన మేరకు డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు కన్వీనర్లు మెంబర్లు హాజరయ్యారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలలకు చెందిన 46 డిగ్రీ సబ్జెక్టులపై ఈ సమావేశంలో చర్చించారు. 2021 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిన పాఠ్యాంశాలపై బి ఓ ఎస్ బృందం చర్చించి స్వల్ప మార్పులను చేశారు. ఈ విద్యా సంవత్సరాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ అసోసియేట్ డా.ఎం.గోపాలకృష్ణ మరియు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్, డీన్స్ పాల్గొన్నారు.





**జనవరి 24**

## జాతీయ బాలికా దినోత్సవం

ఆడపిల్లలకు ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారం, రక్షణ, భద్రత కల్పించి, దుర్వివక్షణను అంతం చేయటమే బాలికా దినోత్సవ ఉద్దేశం. అమ్మాయి చదువు, భద్రత దేశాభివృద్ధికి ముఖ్యమైన అంశం. వారి కళ్ళల్లో వెలుగునింపేందుకు అందరూ సంకల్పించాలి.

– నన్నయవాణి



## ఓ నదీ !

నేర్పవా?– నాకు..
నావ పయనించటం ఆగిపోయినా–
నవ్వుతూ త్రుళ్లతూండటం...
ఒంటరిగా ఒడ్డున నిలబడి తుఫాను కంటిలోకి నేరుగా చూడగల్గటం....
ప్రపంచం ఆక్రమించేసి నిన్ను కదలకుండా చేస్తూంటే హాయిగాపాడుతూ నాట్యమాడటం....
సంతృప్తిగా లేకున్నా సుస్థిరంగా చూడటం....
అన్నిటికన్నా ముఖ్యం–
నీ ప్రశాంతత రహస్యం తెలియజేయ్!
ఈ సృష్టి అనంతత్వాన్ని నాకు విశదపరచు!!


–బొల్లోజు బసవలింగ అహమ్మద్ ఆలీబాబా,
ఇంజినీరింగ్ కళాశాల, నన్నయ విశ్వవిద్యాలయం.


# కళాశాలల అభివృద్ధి మండలి - AKNU

## (College Development Council - CDC)


మాట్లాడుతున్న కమల కుమారి









కళాశాలల అభివృద్ధి మండలి లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్(LMS) అమలు చేస్తుంది. విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాల లన్నిటికీ వీడియో పాఠాలు అందించటం ప్రధానమైన పని. ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థి ఏ అధ్యాపకుని నుండి అయినా, ఎక్కడ నుండి అయినా పాఠ్యాంశాలను నేర్చుకోవడం అనే విశ్వవ్యాప్త భావనకు సి.డి.సి. అంకురార్పణ చేసింది. ఇటీవల ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి ఈ ప్రక్రియను ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆలోచనలు, సూచనలను అనుసరించి ఈ విధానాన్ని మొట్టమొదటిసారిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం లోనే ప్రారంభించారు. విద్యార్థి లోకానికి ఇది ఎంతో ఉపయోగకరమైనది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నిత్య నూతన పద్ధతులు అవలంభిస్తూ విద్యార్థి లోకాన్ని తీర్చిదిద్దే పనిలో సి.డి.సి. కృషి చేస్తోంది.

ఉభయగోదావరి జిల్లాలలోని 444 కళాశాలలు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా విద్యా సేవలు అందిస్తున్నాయి. ఈ కళాశాల లన్నిటికీ విద్యాపరమైన సూచనలు, అనుమతులు, నియంత్రణ, పర్యవేక్షణ విద్యార్థులకు విద్యా పరమైన సమస్యల పరిష్కారం, ఆన్లైన్ ప్రవేశాలు, ఆన్లైన్ వీడియో పాటలు.... వీటినన్నిటినీ సి.డి. సి. పర్యవేక్షిస్తూ , నిర్వహిస్తూ ఉంటుంది.విశ్వవిద్యాలయానికి కళాశాలలకు ప్రధానమైన విద్యా భూమికను నిర్వహించే వ్యవస్థ కళాశాలల అభివృద్ధి మండలి.

### త్వరలోనే ఇ-సిడిసిగా మార్పునకు కృషి




ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు ఇస్తున్న ప్రోత్సాహం విశేష మైంది. సి.డి.సి.ని ఆటోమేషన్ చేసి త్వరలోనే e-CDCగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రతి సమాచారాన్ని యూనివర్సిటీ వెబ్సైట్ పోర్టల్ లో పొందుపరుస్తున్నాం. ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల ప్రమాణాలను, విధులను అన్ని కళాశాలలు అనుసరించే విధంగా ప్రోత్సహిస్తున్నాం. అనుబంధ కళాశాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి నిరంతరం సహకరిస్తున్న కళాశాలల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

**డాక్టర్ ఎం. కమల కుమారి, డీన్ సిడిసి**

### CDC నిర్వహణ

- రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి సూచనలతో విద్యా ప్రగతికి కృషి.
- కళాశాల ఏర్పాటు, అనుమతులు, పర్యవేక్షణ.
- కోర్సు నిర్వహణకు అనుమతి-పర్యవేక్షణ.
- కళాశాలల నిర్వహణ-పర్యవేక్షణ, పరిశీలన
- డిగ్రీ (ఆన్లైన్) ప్రవేశాలు
- అధ్యాపకుల రాటిఫికేషన్
- జ్ఞానభూమి పోర్టల్ ద్వారా స్కాలర్షిప్స్
- ఫీజుల నిర్ణయం,నియంత్రణ, పర్యవేక్షణ
- కళాశాలల స్వయంప్రతిపత్తి-అనుమతులు
- యుజిసి కోర్సుల పర్యవేక్షణ
- విద్యార్థుల కళాశాల బదిలీలు
- విద్యార్థుల విద్యా సమస్యల పరిష్కారం
- ప్రవేశ పరీక్షల నిర్వహణ కళాశాల సమాచారం
- కళాశాల అనుమతి,రద్దు నిర్ణయాలు
- జ్ఞానభూమి పోర్టల్ ద్వారా నిర్వహణ











### విద్యాపరమైన సహకారాన్ని అందిస్తాం



ప్రస్తుతం డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్స్ ప్రక్రియ, లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ నిర్వహణ ద్వారా కొత్త పద్ధతుల్లో కళాశాలలకు విద్యాపరమైన సహకారాన్ని అందించే పనిలో ఉన్నాం.

**డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ డీన్, సిడిసీ,**

**డాక్టర్ పడాల రాజశేఖర్ ఫ్యాకల్టీ అసోసియేట్ సిడిసి**







